

జోరుగా.. హుషారుగా!
జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు ప్రారంభం కాగా.. వివిధ అంశాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. 8లో



దొరికితేనే దొంగలు..
సింగరేణిలో ఉద్యోగాల పేరిట డబ్బులు దండుకున్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
40° / 27°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత గరిష్ట స్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

కాలానుగుణంగా సాగుతో ఫలితం



మాట్లాడుతున్న విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, పక్కన కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని రైతులు వ్యవసాయ కాలానికి అనుగుణంగా పనులు చేపట్టేలా అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు ఉంటాయని రాష్ట్ర విత్తనాభివద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి వ్యవసాయ అధికారులు, విత్తన డీలర్లతో విత్తన పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాల మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధిక దిగుబడి కోసం ఏ విత్తనాలు వాడాలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పచ్చి ఎరువు విత్తనాల పంపిణీలో జిల్లా ఏటా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుస్తోందని, ఈసారి కూడా దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆలస్యంగా విత్తడం వల్ల ఆలస్యంగా పంట చేతికి వస్తుందని, ఇదే సమయాన అకాల వర్షాలతో పంట దెబ్బతినే అవకాశముందని చెప్పారు. ఈమేరకు రైతులను ముందుగా సాగుకు సిద్ధం చేస్తూ విత్తన అమ్మకాలు ప్రారంభించాలని సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్, డీఏఓ విజయనిర్మల, ఎస్‌బీ ఏసీపీ ప్రసన్నకుమార్, అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

ప్రతీ ఫిర్యాదును విచారించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం: ప్రజలు ఇచ్చే ప్రతీ ఫిర్యాదును విచారించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిష్కరించాలని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమిషరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ డేలో 22 మంది ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సమస్యలను తెలుసుకుని క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుల్లో అధికంగా భూవివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలపై ఉన్నాయని అధికారులు తెలిపారు.

ఏసీపీ రమేష్‌కు ఏఎస్పీగా పదోన్నతి



ఖమ్మంక్రైం: ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రామోజీ రమేష్‌కు అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది రామోజీ రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన ఏఈఈ పరీక్ష

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ)ల నియామకానికి నిర్వహిస్తున్న పరీక్షలు ముగిశాయి. రెండో రోజైన సోమవారం ఉదయం ఆరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 1,270మందిలో 766మంది, మధ్యాహ్నం పరీక్షకు 1,270మందికి గాను 768 మంది హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కామేపల్లి మండలంలోని విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



అణువణువునా నిఘా



నకిలీ విత్తనాలను అరికట్టేలా టాస్క్‌ఫోర్స్ బృందాలు

- రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో విస్తృతంగా తనిఖీలు
- సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద డేగకన్ను
- డిమాండ్ ఉన్న విత్తనాలపై ప్రత్యేక దృష్టి

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం సాగు సీజన్ మొదలుకానున్న నేపథ్యాన విత్తన విక్రయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీజన్ వచ్చిందంటే చాలు గ్రామాల్లో అనుమతి ఉన్న కంపెనీలతో పాటు నకిలీ విత్తనాల విక్రయాలు జోరందుకుంటాయి. వివిధ ప్రాంతాల దళారులు రాత్రి వేళ గ్రామాల్లో తిరుగుతూ రైతులకు మాయమాటలు చెప్పి అనుమతి లేని విత్తనాలను అంటగట్టడం తరచుగా వెలుగు చూస్తోంది. వీరికి తోడు కొందరు లైసెన్స్‌డ్ వ్యాపారులు కూడా దందాకు పాల్పడుతుంటారు. తీరా పూత, కాత సమయాన ఫలితం లేక మోసపోయినట్లు రైతులు గుర్తిస్తుంటారు. ఈ నేపథ్యాన అన్నదాతలు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులతో కలిసి రాష్ట్ర, జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేయగా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.

జిల్లాలో ఆరు బృందాలు

విత్తన షాపుల్లో తనిఖీలకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటుచేశారు. అలాగే, రాష్ట్ర స్థాయిలో ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు కలిపి ఒక ఒక బృందాన్ని నియమించారు. ఈ బృందంలో రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్‌కు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.సదానందం, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ వెంకటేశ్వరరావు, విత్తన ధృవీకరణ అధికారులు వేణుమాధవ్, ఎస్.సురేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, ఏఎస్ఐ(సీసీఆర్‌డీ) జ్యోతి ఉన్నారు. ఇక జిల్లా స్థాయిలో పోలీస్ సబ్ డివిజన్ల వారీగా ఐదు బృందాలను నియమించగా ఖమ్మం, ఖమ్మం రూరల్, వైరా, మధిర, కల్లూరు పోలీస్ సబ్ డివిజన్లలో పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులతో ఈ బృందాలు తనిఖీలు ముమ్మరం చేశాయి.

చెక్‌పోస్టులపై నిఘా

ఖమ్మం జిల్లాకు ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగా ఉండడంతో నకిలీ విత్తనాలు చెలామణీ కాకుండా చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద తనిఖీల కోసం వ్యవసాయ విస్తర్ణాధికారుల(ఏఈఓ)ను నియమించారు. ఒక్కో చెక్‌పోస్టులో ఇద్దరు ఏఈఓలకు బాధ్యతలు అప్పగించగా పోలీసుల సహకారంతో వారు తనిఖీలు చేస్తున్నారు.

డిమాండ్ ఉన్న విత్తనాలపై ప్రత్యేక దృష్టి

వరి, పత్తి, మిర్చి తదితర పంటల్లో వివిధ కంపెనీలకు చెందిన విత్తనాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. అధిక దిగుబడులు ఇచ్చేవిగా పేరుగాంచిన విత్తనాల కొనుగోళ్లకే రైతులు కూడా ప్రాధాన్యమిస్తారు. ఇదే అదునుగా వ్యాపారులు, దళారులు దందా చేయకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు రిజిస్టర్లలో స్టాక్ వివరాలు నమోదు చేయాలని, బోర్డుల ద్వారా ప్రదర్శించాలని అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా అడ్డుకోవచ్చని అధికారులు భావిస్తున్నారు.

2014 నుంచి జిల్లాలో నమోదైన విత్తన కేసులు

సంవత్సరం	కేసులు
2014	2
2015	2
2016	17
2017	4
2018	1
2019	1
2020	4
2021	12
2022	3
2023	1

(ఇప్పటి వరకు)

ఇప్పటికే జిల్లాలో ఓ కేసు

జిల్లాలో టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇప్పటికే విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. షాపులు, గోదాంల్లో నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లులను పరిశీలిస్తూ డీలర్లకు అవగాహన కల్పిస్తున్నాయి. కాగా, ఖమ్మం నగరంలోని సుందర్ టాకీస్ రోడ్డులోని అగ్రిహట్ రిటైల్ ప్రైవేట్ లిమిటెడ్ దుకాణం యజమాని నిబంధనలు ఉల్లంఘించి రూ.25.59 లక్షల విలువైన యూఎస్-7069 పత్తి విత్తనాలను బెంగళూరుకు అక్రమంగా తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ బృందం గుర్తించింది. ఈమేరకు ఖమ్మం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అలాగే, పలు ప్రాంతాల్లో అనుమానిత విత్తనాల శాంపిళ్లు సేకరించి పరీక్షలకు పంపిస్తున్నారు.

కళ్లు ఉన్నా కానరావట్లేదా?



కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన మేయర్ నీరజ తదితరులు

- ఖమ్మంలో అభివృద్ధిని తట్టుకోలేకే పిచ్చిమాటలు
- పార్టీ అభ్యర్థులను ఓడించిన ఘనమైన చరిత్ర నీది..
- మాజీ ఎంపీ పొంగులేటిపై మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ధ్వజం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'కళ్లు ఉండి చూడలేని కబోధులు.. ఖమ్మంలో జరిగిన అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక కడుపులో విషం పెట్టుకుని పిచ్చిమాటలు మాట్లాడుతున్నారు' అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మండిపడ్డారు. ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు 91 మందికి రూ.91.10 లక్షల విలువైన చెక్కులను మంత్రి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు ఉంది కదా అని పొంగులేటి విర్రవీగుతున్నాడని విమర్శించారు. ఆయన మాట్లాడేటప్పుడు జనం వెళ్లిపోతే.. ఖాళీ కుర్చీలు చూసి ఫ్రస్టేషన్‌లో మాట్లాడారని ఎద్దేవా చేశారు.

పువ్వాడ అంటే రాజకీయ చరిత్ర..

జిల్లా రాజకీయాల్లో పొంగులేటి ఒక పిట్టల దొర అని పువ్వాడ విమర్శించారు. కానీ ఘనమైన రాజకీయ చరిత్ర కలిగిన పువ్వాడ నాగేశ్వరరావు బిడ్డనైన తాను పేదలు, పీడిత ప్రజల కోసం పని చేస్తానని తెలిపారు. పొంగులేటి వెంట అరాచక శక్తులు, దోపిడీ దారులు, మోసం చేసిన వారు ఉన్నారని, తన పక్కన ఉన్న వారిలో ఏ ఒక్కరిపైనా కేసు కూడా లేదని చెప్పారు. ఖమ్మం ప్రజలకు ఇబ్బంది కలగొద్దని రౌడీషీటర్ల పీచమణిచామని, దందాలు చేసే వారిని అడ్డుకున్నామని తెలిపారు. నేషనల్ హైవే పనులకు మట్టి తీసుకెళ్తున్నారే తప్ప తనకు కానీ, తన మనుషులకు కానీ సంబంధం లేదన్నారు. ఐదేళ్లు ఎంపీగా ఉన్న పొంగులేటి జిల్లాకు ఒక్క తాగునీటి ప్రాజెక్టు, జాతీయ రహదారి తీసుకురాలేకపోయారని.. పేదలకు రూ.2వేలు, రూ.3వేలు ఇస్తూ గొప్ప అనుకుంటున్నారని చెప్పారు. కానీ సీఎం కేసీఆర్ ఇచ్చే రూ.లక్షల ముందు ఇవేమీ లెక్క కాదని తెలిపారు.

పిట్టలదొర బెదిరింపులు చాలా చూశాం..

పిట్టల దొర బెదిరింపులను చాలా చూశామని, చైతన్యవంతులైన ఖమ్మం ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని పువ్వాడ తెలిపారు. ప్రతీ ఎన్నికలోనూ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పొంగులేటి పనిచేశారని, కార్పొరేషన్ ఎన్నికల్లోనూ అభ్యర్థులకు వెన్నుపోటు పొడిచారని పేర్కొన్నారు. 2018 ఎన్నికల్లో పొంగులేటి అనుచరులు ఐదుగురికి టికెట్లు ఇస్తే ఒక్కరినీ గెలిపించుకోలేకపోయారన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు తాను ఖమ్మంను వదిలి పెట్టేది లేదన్నారు. ఖమ్మంలో ఐటీ హబ్, కొత్త బస్టాండ్, కలెక్టరేట్, కేఎంసీ కార్యాలయం, లకారం ట్యాంక్‌బండ్, మెడికల్ కళాశాల ఇలా ఎన్నో పనులు చేశామని రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. రోడ్లు, లైట్లు లేకుండా ఖమ్మం ప్రజలు చీకట్లో ఉండాలా అని పొంగులేటిని ఉద్దేశించి ప్రశ్నించారు. ఇక ఎన్నికల్లో ఎవరిని గెలిపించాలనే స్పష్టత ప్రజలకు ఉందని తెలిపారు.

రూ.78.21 కోట్ల పంపిణీ..

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద ఇప్పటి వరకు జిల్లాలో 8,314 మందికి రూ.78.21 కోట్లు పంపిణీ చేసినట్లు మంత్రి పువ్వాడ తెలిపారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఎంతోమంది పేదల ఇళ్లల్లో పెళ్లి భారం తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, ఆర్డీఓ రవీంద్రనాథ్, తహసీల్దార్ శైలజ, నాయకులు గుండాల కృష్ణ, కార్పొరేటర్లు కమర్తపు మురళి, కర్నాటి కృష్ణ, మగ్బూల్, కూరాకుల వలరాజు, రుద్రగాని శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నష్టాల నుంచి లాభాల్లోకి...



సత్తుపల్లి ఆర్టీసీ డిపో ముఖద్వారం



ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

- రీజియన్‌లో ఏకైక డిపోగా సత్తుపల్లి
- మిగతా ఐదు డిపోలకు తగ్గిన నష్టాలు
- ప్రత్యేక సర్వీసులు, ఇతర చర్యలతో సత్తుపల్లికి పెరిగిన ఆదాయం

సత్తుపల్లిటౌన్: కరోనా సమయంలో ప్రయాణికుల ఆదరణ లేక 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసీ ఖమ్మం రీజియన్ తీవ్ర నష్టాలను చవిచూసింది. ఈ నష్టాలను అధిగమించేలా ప్రయాణికుల ఆదరణ పొందేందుకు తీసుకున్న చర్యలతో 2022-23 సంవత్సరంలో రీజియన్ నష్టాలను తగ్గించుకుంది. కానీ సత్తుపల్లి డిపో మాత్రం నష్టాలను అధిగమించి లాభాల బాట పట్టడం విశేషం. ఈ డిపో మినహా ఖమ్మం, మధిర, మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం డిపోలు ఇంకా నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం లాభనష్టాల గణాంకాలను ఆర్టీసీ అధికారులు తాజాగా ప్రకటించారు. ఈమేరకు 2021-22లో సత్తుపల్లి డిపో రూ.18 కోట్లు నష్టాల్లో ఉండగా.. డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, ఉద్యోగుల తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇవ్వడంతో గడిచిన సంవత్సరం లాభాల బాట పట్టింది. ఈ ఏడాది రూ.69.10 కోట్లు ఆదాయం లభించగా.. రూ.68.93 కోట్లు ఖర్చులు పోగా రూ.16.21 లక్షల లాభాన్ని ఆర్జించడం విశేషం. గడిచిన ఆర్థిక సంవత్సరం ఈ డిపో ఆక్యుపెన్సీ రేషియా(ఓఆర్) 64శాతం సాధించగా, 41.82 శాతం ఈపీకే(ఎర్నింగ్ ఫర్ కిలో మీటర్) నమోదు చేసింది.

రీజియన్‌లో డిపోల వారీగా..


రీజియన్‌లోని ఆరు డిపోల్లో పరిశీలిస్తే నష్టాల్లో కొత్తగూడెం ప్రథమ స్థానంలో కొనసాగుతోంది. ఈ డిపో 2021-22వ ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022-23లో అత్యధికంగా రూ.6.90 కోట్ల నష్టాల్లో ఉంది. ఇక తక్కువగా మణుగూరు డిపోకు రూ.1.07 కోట్ల నష్టం ఎదురైంది.

డిపో	నష్టాలు	
	2021-22	2022-23
ఖమ్మం	రూ.30.84 కోట్లు	రూ.6.69 కోట్లు
మధిర	రూ.10.55 కోట్లు	రూ.6.05 కోట్లు
మణుగూరు	రూ.12.75 కోట్లు	రూ.1.07 కోట్లు
భద్రాచలం	రూ.19.68 కోట్లు	రూ.2.94 కోట్లు
కొత్తగూడెం	రూ.19.41 కోట్లు	రూ.6.90 కోట్లు
సత్తుపల్లి	రూ.18.03 కోట్లు	రూ.16.21 లక్షలు (లాభాలు)

సత్తుపల్లి కలిసొచ్చిన 'స్పెషల్'

సత్తుపల్లి ఆర్టీసీ డిపో ద్వారా పెళ్లిళ్లు, ఇతర ఫంక్షన్లకు బస్సులు అద్దెకు ఇవ్వడం కలిసొచ్చింది. గడిచిన సంవత్సరం ఆర్టీసీ డిపో ద్వారా 628 బస్సులను అద్దెకు ఇవ్వడంతో 1,74,983 కిలోమీటర్లకు గాను రూ.1,20,54,942లు ఆదాయం సమకూరింది. దీనికి తోడు డిపోకు గతంలో రెండు ఉన్న ఏసీ బస్సులను మూడుకు పెంచారు. తిరుపతికి హైటెక్ సర్వీస్ ఏర్పాటుచేయడమే కాక విజయవాడకు నడుస్తున్న ఎనిమిది సర్వీసులను 14కు పెంచారు. అంతేకాక 3,300 దివ్యాంగుల బస్‌పాస్‌లు, 3,600 విద్యార్థుల ఉచిత బస్‌పాస్‌లు, ఎనిమిది వేల మంది విద్యార్థులకు రాయితీ బస్‌పాస్‌లు జారీ చేశారు. అలాగే, శబరిమలైకు రెండు బస్సులు నడిపారు. ఇంకా డిపో పరిధిలోని కల్లూరు, వీ.ఎం.బంజరు, అశ్వారావుపేట బస్టాప్‌ల్లో సిబ్బందిని నియమించి ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ఎక్కేలా కృషి చేయడం సత్ఫలితాలను ఇచ్చింది.

అందరి కృషితోనే విజయం



డిపోలోని అధికారులు, అన్ని విభాగాల ఉద్యోగులు, కండక్టర్లు, డ్రైవర్లు, అద్దె బస్సుల డ్రైవర్ల సమష్టి కృషితోనే డిపోకు లాభాలు వచ్చాయి. ప్రయాణికుల ఆదరణ పొందుతూ వారికి మెరుగైన సేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఉద్యోగులందరి సహకారంతో భవిష్యత్‌లోనూ అత్యధిక ఆదాయం సాధించేందుకు ప్రణాళికలు రూపొందించాం.

– యు.రాజ్యలక్ష్మి, డిపో మేనేజర్, సత్తుపల్లి

ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

- ప్రగతిపై ఫొటో ఎగ్జిబిషన్లు, స్టాళ్లు
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 2వ తేదీ నుండి 21 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనుండగా, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ ఎగ్జిబిషన్లు, స్టాళ్లు ఏర్పాటుచేయాలని తెలిపారు. అలాగే, ఇతర అంశాలపై సూచనలు చేశారు. అలాగే, కార్మిక, తదితర అధికారులతో సమావేశమైన కలెక్టర్.. జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న 800మంది దినసరి వేతన కూలీల భత్యం పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రెండో విడత గొర్రెల పంపిణీ

జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి కార్యాచరణ మొదలుపెట్టాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల్లో ఎవరైనా చనిపోతే చట్టబద్ధమైన వారసులకు యూనిట్లు అందించాలన్నారు. ఏపీలోని ప్రకాశం, నెల్లూరు, కర్ణాటక లోని రాయచూరు జిల్లాల నుండి గొర్రెల సేకరణకు ప్రభుత్వం సూచించిందని తెలిపారు.

భాగ్యరెడ్డివర్మకు నివాళి

దళిత వైతాళికుడు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద కలెక్టర్ గౌతమ్, అధికారులు నివాళులర్పించారు. భాగ్యరెడ్డివర్మ సంఘ సంస్కర్తగా విశేష సేవలందించారని, హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించారని గుర్తు చేశారు.



సింగరేణి అధికారుతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన ఎమ్మెల్యే వెంకటవీరయ్య (ఇన్‌సెట్) భాగ్యరెడ్డి వర్మకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎస్.మధుసూదన్, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, డీఆర్వో శిరీష, కార్మికశాఖ ఉప కమిషనర్ రమేష్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.సత్యనారాయణ, జిల్లా పశు సంవర్ధక అధికారి వేణుమనోహర్, జిల్లా ఉపాధికల్పనాధికారి శ్రీరాం, అధికారులు వెంగమాంబ, శాస్త్రి పాల్గొన్నారు.

సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి

సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి సింగరేణి అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి సింగరేణి ఇచ్చిన హామీలు అమలుచేయాలని, పాత ఎన్టీఆర్ కెనాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని, పేలుళ్లతో నష్టపోయిన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సూచించారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం జె.రమేష్, ఆర్డీఓ సీహెచ్.సూర్యనారాయణ, మైనింగ్ ఏడీ సంజయ్‌కుమార్, ఏసీపీ రామానుజం, తహసీల్దార్ శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ సుజాత, అధికారులు వెంకటాచారి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదులు పెండింగ్‌లో ఉండొద్దు

గ్రీవెన్స్ డేలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యత ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో భాగంగా ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించాక ఆయన అధికారులతో సమావేశమై సూచనలు చేశారు.కాగా, రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులే ఎక్కువగా అందాయని అధికారులు తెలిపారు.

మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్-1 మాక్ టెస్ట్



ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు హాజరుకానున్న మైనార్టీ అభ్యర్థులకు రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్, మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మాక్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎం.ఏ.మహమూది తెలిపారు. ఈనెల 25, జూన్ 1, 8వ తేదీల్లోవీ టెస్ట్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 24వ తేదీ వరకు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 08742-293565 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలపై చర్చ

- ప్రక్రియ మొదలుపెడితే భారీగా ఉద్యోగులకు స్థానచలనం
- ఉమ్మడి జిల్లాలో 70 మంది బదిలీ అయ్యే అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో అధికారులు, ఉద్యోగుల బదిలీలపై మరోసారి చర్చ మొదలైంది. రెండేళ్లుగా బదిలీల ప్రక్రియపై ప్రచారం జరుగుతున్నా కార్యరూపం దాల్చలేదు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు జరగక ఏడేళ్లు దాటగా, గతేడాది బదిలీలు తప్పవని అందరూ భావించారు. కానీ చివరి నిమిషంలో ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా మరోసారి బదిలీలపై చర్చ జరుగుతోంది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ నేతృత్వాన కమిటీ సమావేశమై బదిలీల అంశంపై చర్చించినట్లు చెబుతున్నారు.

మూడేళ్లు పైబడిన వారే ఎక్కువ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఖమ్మం జిల్లా కేంద్రంగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, చిట్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు పది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో ఒకే చోట సర్వీసు పూర్తి చేసుకున్న అధికారులు, సిబ్బంది వివరాలను ప్రభుత్వం ఇప్పటికే రెండు సార్లు సేకరించింది. నాలుగు నెలల క్రితం కూడా జిల్లా ఉద్యోగుల వివరాలు తీసుకోగా 80 మంది ఉద్యోగుల్లో 70 మంది మూడేళ్లు పైబడి ఒకే చోట పని చేస్తున్నట్లు తేల్చారు. ఒకవేళ తాజా సమాచారం ప్రకారం బదిలీలు జరిగితే వీరందరికీ స్థానచలనం తప్పకపోవచ్చని తెలుస్తోంది.

క్లుప్తంగా

టీపీసీసీ సమావేశానికి జిల్లా నేతలు


సమావేశంలో పాల్గొన్న దుర్గాప్రసాద్, పోట్ల తదితరులు

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం టీపీసీసీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే తదితరులు ప్రసంగించగా కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాలోతు రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై విమర్శలు సరికాదు..

ఖమ్మంక్రైం: ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పోలీసులపై విమర్శలు చేయడం సరికాదని పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతభద్రత పరిరక్షణలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పోలీసులకు దేశంలోనే మంచి గుర్తింపు ఉండగా, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎవరు అధికారంలో ఉన్నా తాము చట్టానికి, న్యాయస్థానాలకు లోబడి పనిచేస్తామని, ఎవరి వద్దకూ ఫైల్స్ పట్టుకుని వెళ్లాల్సిన అవసరం లేదని తెలిపారు.

రచయిత విశ్వనాథరెడ్డికి పలువురి నివాళి

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు కథా ప్రక్రియను విశ్వవ్యాప్తం చేసిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి హఠాన్మరణంతో తెలుగు కథ పెద్ద దిక్కును కోల్పోయిందని పలువురు పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఖమ్మంలో సాహిత్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు మువ్వా శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సగటు మానవుల జీవన వైచిత్రిని విశ్వనాథరెడ్డి తన కథల ద్వారా అందరికీ పరిచయం చేశారని కొనియాడారు. ఆయన మృతి తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. అలాగే, కార్యవర్గ సభ్యులు అట్లూరి వెంకటరమణ, వురిమళ్ల సునంద, కన్నెగంటి వెంకటయ్య, మేడగాని శేషగిరి,రౌతు రవి, కొండ్రు బ్రహ్మం, గద్దపాటి శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

పంట నష్టపరిహారం చెల్లించండి

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలకు ముందే ముఖ్యమంత్రి ప్రకటించినట్లుగా రైతులకు పంట నష్టపరిహారం ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. వచ్చేనెల 2 తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం తీర్మానించడమే కాకుండా నిధులు కేటాయించారని తెలిపారు. కానీ అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు పరిహారం ప్రకటించి రెండు నెలలు గడిచినా ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఇకనైనా నష్టపరిహారం చెల్లించడంతో పాటు ధాన్యం, మొక్కజొన్న మొత్తం కొనుగోలు చేయాలని, రుణ మాఫీ ప్రక్రియ పూర్తిచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మహిళ ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లిలో బోడుకాలనీకి చెందిన తాటిఆకుల సావిత్రి (50) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త కొన్నేళ్ల క్రితం మరణించగా, మనోవేదనతో ఆమె ఆదివారం రాత్రి పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలోకి చేరిన ఆమెను స్థానికులు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సావిత్రికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని పోలిశెట్టిగూడెంలో విద్యుదాఘాతంతో సోమవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామంలోని తోటలో మామిడికాయలు తెచ్చుకునేందుకు పలువురితో కలిసి అలస్యం వెంకటేశ్వర్లు(48) వెళ్లాడు. తోట మధ్య నుండి విద్యుత్ మెయిన్ లైన్ తీగలు వెళ్తుండగా కాయలు కోసే సమయాన వెంకటేశ్వర్లు తీగలకు తాకడంతో షాక్ గురై మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు చేరుకొని మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పందులు పట్టేందుకు వచ్చిన వారిపై దాడి

ఖమ్మంక్రైం: పందులు పట్టేందుకు చెన్నై నుండి ఖమ్మం వచ్చిన వారిపై నగరానికి చెందిన కొందరు దాడికి పాల్పడ్డారు. ఇటీవల ఖమ్మం కార్పొరేషన్ అధికారులు నగరంలో పందులను పట్టేందుకు చెన్నైకి చెందిన 16మందిని పిలిపించారు. వీరు ఎన్నెస్పీ క్యాంపులో సోమవారం పందులు పడుతుండగా ఓ సామాజిక వర్గానికి చెందిన కొందరు రాళ్లతో దాడి చేయడమే కాక వాహనాన్ని ధ్వంసం చేశారు. దీంతో బాధితులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలలు.. రేపటి తరం ప్రతినిధులు



పోటీల్లో విజేతలతో డీఈఓ సోమశేఖరశర్మ, రెజొనెన్స్ డైరెక్టర్లు శ్రీధర్‌రావు, కృష్ణవేణి, సాక్షి బీఎం మోహనకృష్ణ, ఉద్యోగులు, (ఇన్‌సెట్) కరాటే పోటీలను పరిశీలిస్తున్న రెజొనెన్స్ డైరెక్టర్ శ్రీధర్‌రావు

- పిల్లల ఆలోచనలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి
- జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ
- ముగిసిన 'సాక్షి మీడియా, రెజొనెన్స్ శ్రీనగర్' వేసవి పోటీలు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు యంత్రాలు కాదని.. రేపటి తరానికి ప్రతినిధులని, వారి ఆలోచనలను తెలుసుకుని నచ్చిన అంశాల్లో ప్రోత్సహిస్తే గొప్పగా ఎదుగుతారని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. సాక్షి మీడియా, రెజొనెన్స్ శ్రీనగర్ స్కూల్ ఆధ్వర్యాన మూడు రోజులుగా నిర్వహిస్తున్న చెస్, డ్రాయింగ్, కరాటే పోటీలు సోమవారం ముగిశాయి. ఈ మేరకు ఏర్పాటుచేసిన సమావేశంలో డీఈఓ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థులు కొత్త అంశాలను నేర్చుకునేలా ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. భవిష్యత్‌లో 'సాక్షి' ఆధ్వర్యాన మరిన్ని రకాల పోటీలను నిర్వహించిన విద్యార్థులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. కాగా, తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి మార్కులు రావాలని ఆలోచిస్తున్నారే తప్ప చదువుతో పాటు ఆటపాటలు అవసరమని గుర్తించడం లేదన్నారు. ఈ దిశగా తల్లిదండ్రులు ముందుకొస్తే విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదుగుతారని తెలిపారు. పాఠశాలల్లోనూ వారానికోరోజు టాలెంట్స్ డే నిర్వహిస్తే బాగుంటుందని డీఈఓ అభిప్రాయం వ్యక్తం చేశారు.

గెలుపోటములు సహజం

రెజొనెన్స్ శ్రీనగర్ డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి మాట్లాడుతూ 'సాక్షి' మీడియా ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పోటీలు విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, ప్రతీ ఓటమిని విజయానికి మెట్టుగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించటం ద్వారానే వారిలో దాగి ఉన్న నైపుణ్యాలు వెలుగులోకి వస్తాయనే తెలిపారు. సాక్షి బ్రాంచ్ మేనేజర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లో అధిక సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీలకు పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరుకాగా చెస్, డ్రాయింగ్, కరాటేల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికే కాక కన్సోలేషన్ బహుమతులు, అందరికీ సర్టిఫికెట్లను డీఈఓ శర్మ, స్కూల్ డైరెక్టర్లు అందజేశారు. సాక్షి ఉద్యోగులు శేషు, వేణు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణకు కరాటే దోహదం



ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసం కరాటే దోహదపడుతుంది. అందుకే ఆసక్తిగా కరాటే నేర్చుకుంటున్నా. సాక్షి మీడియా, రెజొనెన్స్ స్కూల్ ఆధ్వర్యాన జరిగిన పోటీల్లో బాలికల కటా – ఏ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించాను. పలువురితో పోటీ పడి బహుమతి గెలుచుకోవడం ఆనందంగా ఉంది.

– కె.శ్రీనిధి, పదో తరగతి, రెజొనెన్స్ శ్రీనగర్

కరోనా సమయంలో నేర్చుకున్నా..



కరోనా సమయాన నేర్చుకున్న చెస్ ఆతర్వాత ఇష్టంగా మారింది. ఆన్‌లైన్‌లో ఇతర దేశాల వారితో కూడా చెస్ ఆడి గెలిచా. హైదరాబాద్‌లో జరిగిన చెస్ పోటీల్లో పాల్గొంటే 100కి 80పాయింట్లు లభించాయి. ఇప్పుడు సాక్షి మీడియా, రెజొనెన్స్ పోటీల్లో పాల్గొని మొదటి బహుమతి సాధించాను.

– టీవీఎస్.బాలఈశ్వర్, పదో తరగతి, గోర్కి పబ్లిక్ స్కూల్

చాలా సంతోషంగా ఉంది..



సాక్షి మీడియా నిర్వహించిన పోటీల్లో పాల్గొనటం సంతోషంగా ఉంది. ఇలాంటి పోటీలను మరిన్ని నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహించాలని కోరుతున్నా. ఈ పోటీల్లో కన్సోలేషన్ బహుమతి సాధించాను. అయినప్పటికీ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించేలా డ్రాయింగ్‌లో మెళకువలు నేర్చుకుంటాను.

– డి.జస్మిత, 6వ తరగతి, రెజొనెన్స్ శ్రీనగర్

ఏన్కూరు క్రీడాకారుల ప్రతిభ


ద్వితీయ స్థానంలో నిలిచిన ఏన్కూరు క్రీడాకారులతో పీఈటీలు

ఏన్కూరు: జిల్లాస్థాయి సీఎం కప్ పోటీల్లో భాగంగా కబడ్డీలో ఏన్కూరు జట్టు ద్వితీయ బహుమతి సాధించింది. అంతేకాక జట్టు నుంచి ఇద్దరు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జట్టును పీఈటీలు శోభన్, చిన్నబాబు, లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

కల్లూరు క్రీడాకారుల సత్తా

కల్లూరు: ఖమ్మం పటేల్ స్టేడియంలో జరుగుతున్న జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో కల్లూరు మండల క్రీడాకారులు సత్తా చాటారు. మహిళల కబడ్డీ పోటీల్లో మండల జట్టు మూడో స్థానంలో నిలవగా ఆనంగి కావేరి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే, పురుషుల విభాగం కబడ్డీ సెమీ ఫైనల్స్‌లో ఓడిపోయినా ప్రతిభ కనబరిచిన శీలం వినోద్‌కుమార్, బానోత్ బాలాజీని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఇక మహిళల వాలీబాల్‌లో మూడో స్థానం దక్కించుకోగా, పురుషుల వాలీబాల్‌లో సెమీఫైనల్స్‌కు చేరారు. ఈసందర్భంగా పీఈటీలు లక్ష్మీనరసయ్య, విజయకుమారి, త్రివేణి, పసుపులేటి వీరరాఘవయ్యను ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, ఎంపీడీఓ బి.రవికుమార్ అభినందించారు.

20 లీటర్ల కలుపుమందు పట్టివేత

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేటలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 20 లీటర్ల కలుపు మందును పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం నిషేధించిన కలుపుమందును అక్రమంగా నిల్వ చేశారనే సమాచారం అందడంతో స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

కొత్తగూడెంటౌన్: పట్టణంలోని రామాటాకీస్ ఏరియాలో ఉన్న శ్రీరామచంద్ర గరల్స్ హైస్కూల్‌లో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. పాఠశాల స్టోర్ రూంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు అంటుకున్నాయి. మంటలు ఎగసిపడి భవనంలోని రెండు అంతస్తులకు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో వచ్చిన ఫైరింజన్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. మంటలను ఆర్పేందుకు సమారు గంట సమయం పట్టింది. మంటలు చుట్టుపక్కల భవనాలకు వ్యాపించకపోవడం, పాఠశాలలకు సెలవులు కావడంతో పెను ప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదంలో దాదాపు రూ.లక్ష విలువైన ఫర్నిచర్ దగ్ధమైందని ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు.

జాతీయ ఖోఖో పోటీలకు వసంతరావు ఎంపిక


వసంతరావు

టేకులపల్లి: వచ్చే నెల 9 నుంచి ఒడిశాలో జరగబోయే జాతీయ ఖోఖో పోటీలకు టేకులపల్లి మండలం పెట్రాంచెలక గ్రామానికి చెందిన ఈసం వసంతరావు ఎంపికయ్యాడు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. తనతోపాటు ఇల్లెందు మండలం సుదిమళ్లకు చెందిన కాయం కిరణ్, గుండాల మండలం దామరతోగుకు చెందిన కల్తి అన్వేష్‌లు కూడా ఎంపికైనట్లు పేర్కొన్నాడు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం పట్ల ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఎంపీపీ భూక్య రాధ, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అర్చకుల వేతనాలు పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: ధూప, దీప, నైవేద్య పథకం అమలవుతున్న ఆలయాల్లో అర్చకుల గౌరవ వేతనాన్ని రూ.4 వేల నుంచి రూ.15 వేలకు, రూ.2వేలుగా ఉన్న పడితరాన్ని రూ.7,500కు పెంచాలని అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ కోరారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలుచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇరవై ఏళ్లు పైబడిన అన్ని ఆలయాలకు ధూప, దీప, నైవేద్య పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. ఈ సమావేశంలో రమేష్‌శర్మ, భార్గవాచార్యులు, ప్రసాద్ శర్మ, ఆమంచి సురేష్ తదితరులు పాల్గొనగా, లక్కినేని వెంకటేశ్వరావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ లక్కినేని సుధీర్‌బాబు వారికి మద్దతు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రైతులు సహకరించాలి


వేలం నిర్వహిస్తున్న అధికారులు

చింతకాని: ఆలయ అభివృద్ధికి దేవాలయ భూములను కౌలు చేస్తున్న రైతులందరూ సహకరించాలని దేవాదాయ ధర్మదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత సూచించారు. చింతకానిలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం భూముల కౌలు వేలం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమత మాట్లాడుతూ 69 ఎకరాలను రూ.12.68 లక్షలకు ఏడాది పాటు సేద్యం చేసుకునేలా రైతులు దక్కించుకున్నారని తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది ఆదాయం పెరిగిందని చెప్పారు. రైతులు కౌలు నగదు సక్రమంగా చెల్లించి ఆలయాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆలయ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, ఈఓ సీహెచ్.రామకోటేశ్వరరావు, దేవాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తోటకూరి వెంకటేశ్వర్లుతోపాటు మేకనబోయిన రాంబాబు, బొర్రా ప్రసాద్‌రావు, ఆకుల చంద్రయ్య, తన్నీరు రాజేందర్ బాబు, బచ్చు మంగమ్మ, గంధసిరి వెంకటేశ్వర్లు, పోతురాజు గోపాలరావు, మంచాల సుధాకర్, ఫణిహారం శ్రీనివాసాచార్యులు, సిద్దల నాగరాజు, మురళి, సిబ్బంది రామారావు, నాగార్జున్ పాల్గొన్నారు.

భూవివాదంలో ఆరుగురిపై కేసు

కూసుమంచి: మండలంలోని కోక్యాతండాలో ఇంటి స్థలం విషయమై దాడికి దిగి గాయపర్చిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌కుమార్ తెలిపారు. తండాకు చెందిన తేజావత్ వీరమ్మ ఇంటి స్థలాన్ని శంకర్‌కు అమ్మగా కొలతలు వేయిస్తున్నారు. ఇంతలోనే గ్రామానికే చెందిన తేజావత్ మోహన్, భార్య జ్యోతి, కుమారులు రామోజీ, చరణ్, తల్లి గమ్లీతో పాటు డ్రైవర్ ధరావత్ శ్రీను వచ్చి వీరమ్మతో గొడవ పడుతుండగా ఆమె కుమారులు రామోజీ, రవి అడ్డుకున్నారు. దీంతో వీరమ్మ తదితరులపై దాడి చేసి గాయపరిచారు. ఘటనపై వీరమ్మ ఫిర్యాదుతో మోహన్ సహా ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మధిర: రాత్రివేళ రోడ్డుపైకి వచ్చిన గేదెలను ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం దుందిరాలపాడుకు చెందిన రంగిశెట్టి శివరామకృష్ణ, మధిర మండలం దేశినేనిపాలెంకు చెందిన తన స్నేహితుడితో కలిసి మధిర నుంచి దుందిరాలపాడుకు సోమవారం రాత్రి బయలుదేరాడు. ఈక్రమాన ఆత్కూరు–తునికిపాడు మధ్య రోడ్డుపైకి గేదెలు అడ్డుగా చీకట్లో కనిపించక ఢీకొట్టారు. ఈ ఘటనలో శివరామకృష్ణకు తీవ్ర గాయాలు కాగా మధిరలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం విజయవాడ తరలించారు.

పాతకక్షల నేపథ్యాన యువకుడిపై దాడి


దాడిలో గాయపడ్డ సతీష్

వైరారూరల్: మండలంలోని రెబ్బవరంలో పాతకక్షల నేపథ్యాన బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు చల్లా సతీష్‌పై పలువురు దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై బాధితుడి తండ్రి వెంకటేశ్వర్లు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సతీష్ తన మిత్రుడు బత్తుల నాగబాబుతో కలిసి ద్విచక్రవాహనంపై కొండకొడిమ వైపు వెళ్తుండగా వైరా పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న రెబ్బవరానికి చెందిన కానిస్టేబుల్ బండారు హరీష్, ఆయన బంధువులు శ్రీను, మక్కాల శివానీ, పల్లపు శేషమ్మ, గణేష్, దేవళ్ల సురేష్ తదితరులు దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మారణాయుధాలతో సతీష్‌పై హత్యాయత్నం చేయడమే కాక నాగబాబును కూడా కొట్టారని తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సతీష్‌ను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, హరీష్ కుటుంబంతో ఉన్న పాత కక్షల నేపథ్యాన ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు వైరా ఎస్సై శాఖమూరి వీరప్రసాద్ తెలిపారు.

ఖమ్మంలో...

ఖమ్మంక్రైం: పాత కక్షల నేపథ్యాన నలుగురు యువకులపై కొందరు దాడి చేశారు. నగరానికి చెందిన లింగబోయిన రవి, నర్రా కార్తీక్, కట్ల సాయి, కొంగర సాయి ఆదివారం అర్ధరాత్రి నిజాంపేట వెళ్తుండగా కొందరు వచ్చి తీవ్రంగా కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో నలుగురి తలలు పగిలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు చేసిన ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా


ఎక్స్‌గ్రేషియా అందజేస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు భద్రాద్రి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఎక్స్‌గ్రేషియా అందించారు. సోమవారం తన కార్యాలయంలో ఏఎస్సై శ్యాంసన్ కుటుంబానికి రూ.4 లక్షలు, హెడ్ కానిస్టేబుల్ ముత్తయ్య కుటుంబానికి రూ.8 లక్షల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భద్రతా విభాగం నుంచి ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందించినట్లు తెలిపారు. పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా పోలీసు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి అజయ్, పక్కన మేయర్ నీరజ, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు



జోరుగా.. హుషారుగా!

- ప్రారంభమైన జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు
- జిల్లావ్యాప్తంగా హాజరైన 1,200 మంది క్రీడాకారులు
- పోటీలను ప్రారంభించిన మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 1,200 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈమేరకు పోటీలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేలా ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలో క్రీడారంగం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత ఖమ్మంలో ఉన్నట్లుగా సౌకర్యాలు మరెక్కడా లేవని చెప్పారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి మాట్లాడుతూ కబడ్డీ పోటీలకు 356మంది, వాలీబాల్‌కు 301, ఖో–ఖోకు 353 మంది, ఫుట్‌బాల్ పోటీలకు 55మంది హాజరయ్యారని తెలిపారు. ఈకార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, డీసీసీబీ చైర్మన్ కూరకుల నాగభూషణం, డీఈఓ సోమశేఖరశర్మ, ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రఘునందన్, పోటీల పరిశీలకులు క్రిస్టోఫర్ బాబు, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎండీ.అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన మంత్రి అజయ్‌కుమార్, సీపీ వారియర్, మేయర్ నీరజ, అదనపు కలెక్టర్ స్నేహలత తదితరులు


కబడ్డీ పోటీలో తలపడుతున్న బాలికలు

హోరాహోరీగా పోటీలు

సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. మొదటి రోజు ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించగా క్రీడాకారులు సత్తా చాటారు. క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పించడమే కాక ఎండవేడి నుంచి నుంచి ఉపశమనం కోసం షామినాయాలు ఏర్పాటుచేశారు. కాగా, టేబుల్ టెన్నిస్ పోటీల పురుషుల విభాగంలో ఎస్.కే.యాకుబ్ అలీ, పి.మోహిత్ కృష్ణ (ఖమ్మం), ఎం.రాంసంతోష్, పి.అజయ్(ఖమ్మం) మొదటి రెండు స్థానాలు సాధించగా, సింగిల్స్‌లో ఎస్.కే.యాకుబ్ అలీ, డి.సాయి, పి.మోహిత్‌కృష్ణ మొదటి మూడు స్థానాల్లో నిలిచారని డీవైఎస్‌ఓ తెలిపారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎస్.కే.యాకుబ్ అలీ – జి.సిరి, టి.శిరీష – ఎం.నరేందర్, మహిళల సింగిల్స్‌లో టి.శిరీష, జి.సిరి ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారని వెల్లడించారు.

ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసుకోవాలి


సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. మండలంలోని వందనంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లకు సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం కేసీఆర్ నేరుగా నిధులను మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఈనిధులు సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ ఆకాంక్షల మేరకు అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, సర్పంచ్ కొరిపల్లి సునీత, ఎంపీడీఓ శ్రీనివాసరావుతో పాటు గురిజాల హన్మంతరావు, మంకెన రమేష్, అంకిరెడ్డి రాఘవరెడ్డి, నల్లమోతు శేషగిరిరావు, పెంట్యాల పుల్లయ్య, బొడ్డు వెంకట్రామయ్య, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

కేసీఆర్, కేటీఆర్ అండతోనే ఎదిగావు

పొంగులేటిపై మంత్రి పువ్వాడ ఫైర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఐదు నెలల క్రితం వరకు బీఆర్‌ఎస్‌లో ఉండి.. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను పొగిడి వేల కోట్ల కాంట్రాక్టులు సంపాదించుకున్నావు.. వారి అండతోనే ఎదిగావు. ఇప్పుడు డబ్బు ఉంది కదా అని విర్రవీగుతున్నావు'అని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశాక పువ్వాడ మాట్లాడారు. 2016లో టీఆర్‌ఎస్‌లో చేరినప్పుడు పొంగులేటి ఆర్థిక పరిస్థితి, కంపెనీ టర్నోవర్ ఎంతో గుర్తు చేసుకోవాలన్నారు. ఎన్నెస్పీ లెఫ్ట్ కెనాల్ ఆధునీకరణ పనులను తూతూ మంత్రంగా చేపట్టి వందల కోట్లు దండుకున్నారని, దీనిపై నమోదైన ఫిర్యాదులో విజిలెన్స్ నివేదిక ఇవ్వడంతో తప్పించుకోవడానికే రాజకీయాల్లోకి వచ్చారని విమర్శించారు. ఆ కేసులన్నీ ఇప్పటికీ అలాగే ఉన్నాయని గుర్తు చేశారు. నిన్నటి వరకు పార్టీ పెడతానని, ఆ పార్టీ, ఈ పార్టీ నేతలు తనతో టచ్‌లో ఉన్నారంటూ మాట్లాడారన్నారు. పొంగులేటి కాంగ్రెస్‌లోకే వెళ్తారని, ఆ పార్టీలోకి వెళ్లాక కేసీఆర్ విలువ ఏమిటో ఆయనకు తెలుస్తుందని పువ్వాడ అన్నారు. టీఆర్‌ఎస్‌లో ఉండి పార్టీ అభ్యర్థులను ఓడించిన ఘన చరిత్ర పొంగులేటిదని విమర్శించారు. 2018 ఎన్నికల్లో ఆయన చేసిన నిర్వాకానికే 2019 ఎన్నికల్లో కేసీఆర్ ఆయనకు టికెట్ ఇవ్వలేదని, పద్ధతి మార్చుకోవాలని కేసీఆర్ చెప్పినా మార్పురాలేదన్నారు. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో పొంగులేటి పిట్టలదొర అని ఘాటుగా విమర్శించారు. ఐదేళ్లు ఎంపీగా ఉండి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

తెయూ ఈసీ మెంబర్లకు లాయర్ నోటీసులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వీసీ డి.రవీందర్‌గుప్తా లాయర్ పేరిట 11 మంది పాలకమండలి (ఈసీ) సభ్యులకు సోమవారం నోటీసులు వచ్చాయి. స్థానికంగా ఉన్న సభ్యులు నోటీసులు తీసుకోగా, మిగిలినవారు ఇంకా తీసుకోలేదు. ఈసీ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 2023 ఏప్రిల్ 19న జరిగిన 55వ ఈసీ సమావేశంలో పాల్గొన్న కళాశాల విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్, ఆర్థికశాఖ డిప్యూటీ డైరక్టర్ చంద్రకళతో పాటు హాజరైన 8 మంది ఈసీ మెంబర్లు, ఈసీ తీర్మానంతో రిజిస్ట్రార్‌గా నియామకమైన ప్రొఫెసర్ యాదగిరికి నోటీసులు వచ్చాయి. 55వ ఈసీ సమావేశాన్ని వీసీ రవీందర్‌గుప్తా వాకౌట్ చేసిన తర్వాత, రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణ చైర్మన్‌గా వ్యవహించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఉన్న విద్యావర్ధినిని గుర్తించబోమని, ప్రొఫెసర్ యాదగిరి రిజిస్ట్రార్‌గా రెండేళ్ల పాటు కొనసాగుతారని, అలాగే వీసీపై చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో తీర్మానించారు. దీంతో 55వ ఈసీ తీర్మానాలను రద్దు చేయాలని కోరుతూ వీసీ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు మధ్యంతర రద్దు ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం ఏప్రిల్ 26న 56వ, మే 5న 57వ, మే 12న 58వ ఈసీ సమావేశాలు నిర్వహించారు. అయితే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల తర్వాత నిర్వహించిన ఈసీ సమావేశాలు, తీర్మానాలు అన్నీ చట్టవిరుద్ధమని, వాటిని వెంటనే రద్దు చేసుకోవాలని నోటీసుల్లో పేర్కొన్నారు. తెయూ ఎస్‌బీఐకి మెయిల్ చేసే అధికారం నవీన్‌మిట్టల్ పీఏకు లేదని, ఈసీ సమావేశాల్లో వీసీపై చేసిన తీర్మానాలు రద్దు చేసుకోకపోతే.. కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాల్సి ఉంటుందని నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ సెక్రటరీ వాకాటి కరుణకు, కార్యదర్శి నవీన్‌మిట్టల్‌కు సమాచారం ఇచ్చినట్లు ఈసీ మెంబర్లు తెలిపారు. ఈ నెల 25న జరగనున్న సమావేశంలో నోటీసులపై చర్చించే అవకాశం ఉందన్నారు.

ఎల్లో మీడియా ఓవరాక్షన్

ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేయబోతున్నారంటూ తప్పుడు కథనాలు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని అరెస్టు చేయబోతున్నారంటూ సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎల్లో మీడియా ఓవరాక్షన్ చేసింది. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్న తల్లి శ్రీలక్ష్మి బాగోగులు చూసుకుంటున్న అవినాశ్ పట్ల కనీస మానవత్వాన్ని కూడా మరిచి ఎల్లో మీడియా అమానుష ధోరణిని బయటపెట్టుకుంది. సీబీఐ అధికారులు సోమవారం కర్నూలుకు రావడంతో అదే అదనుగా రెచ్చిపోయింది. అవినాశ్‌ను ఎలాగైన అరెస్టు చేయించాలన్న విపరీత ధోరణి, కర్నూలు నగరంలో ఉద్రిక్తతలు సృష్టించాలన్న వ్యూహంతో క్షణక్షణం అసత్య ప్రచారంతో హోరెత్తించింది. గంట గంటకు ఎల్లో మీడియా పిచ్చి ముదిరి, మధ్యాహ్నానికి పీక్స్‌కు చేరుకొంది. స్థానిక పోలీసులు సహకరించడంలేదని, మధ్యాహ్నానికి కర్నూలుకు కేంద్ర బలగాలు వస్తున్నాయని, ఆ వెంటనే సీబీఐ అధికారులు అవినాశ్‌ను అరెస్టు చేస్తారంటూ తప్పుడు ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఎల్లో మీడియా విపరీత ధోరణిని రాష్ట్రవ్యాప్తంగా పలువురు తప్పుపట్టారు. తల్లి ఆరోగ్యం బాగోలేక బాధలో ఉన్న వ్యక్తిపట్ల అమానవీయంగా వ్యవహరించడాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సభ్య సమాజం ఖండించాయి. ఒక ఎంపీకి ఉండే హక్కులు, ఆయన ప్రైవసీని భంగపరిచే విధంగా పచ్చ పైత్యాన్ని వెళ్లగక్కుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురదజల్లే కుట్రలో భాగంగానే వైఎస్ అవినాశ్‌రెడ్డి లక్ష్యంగా ఎల్లోమీడియా ఈ దుర్నీతికి పాల్పడుతోందని స్పష్టమవుతోంది. అందులో భాగంగానే అర్ధరాత్రి వేళ ఆస్పత్రిలోకి చొరబడుతున్నారని, ఎంపీ తల్లికి అందిస్తున్న చికిత్సపై వైద్యులు సమాచారం అందిస్తున్నా, అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినాశ్ సోమవారం సీబీఐ విచారణకు హాజరు కావల్సి ఉంది. అయితే, ఆయన తల్లి తీవ్ర అనారోగ్యంతో ఈనెల 20వ తేదీ నుంచి కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య బృందం ఆమెను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తోంది. అవినాశ్ దగ్గరుండి ఆమె బాగోగులు చూసుకుంటున్నారు. తన తల్లి ఆరోగ్యం బాగోలేనందున విచారణకు హాజరు కాలేనని, ఈ నెల 27 తర్వాత హాజరవుతానని అవినాశ్ సీబీఐ అధికారులకు లేఖ పంపారు. అయినప్పటికీ, సీబీఐ అధికారులు సోమవారం ఉదయం కర్నూలు వచ్చారు. స్టేట్ గెస్ట్‌హౌస్‌లో బస చేశారు. దీనినే అవకాశంగా తీసుకున్న ఎల్లో మీడియా వెంటనే తప్పుడు కథనాలు ప్రచారం చేయడం ప్రారంభించింది. అవినాశ్‌ను అరెస్టు చేయడానికే సీబీఐ అధికారులు వచ్చారంటూ అసత్య ప్రచారం మొదలెట్టింది. వారు పోలీసు అధికారులను కలిసినట్లు, అవినాశ్‌ను ఏ క్షణంలోనైనా అరెస్టు చేస్తారంటూ స్క్రోలింగ్‌లు, చర్చలు ప్రారంభించింది. ఓ వ్యక్తి తల్లి అనారోగ్యంతో ఉంటే, అతన్ని లక్ష్యంగా చేసుకోకూడదన్న కనీస మానవతా ధర్మాన్ని కూడా విస్మరించి, తీవ్ర ఆందోళనలో అవినాశ్ పట్ల విపరీత ధోరణిని ప్రదర్శించింది. ఓ వ్యక్తికి ఉండే ప్రైవసీని కూడా హరించేలా వ్యవహరించింది. దగ్గరుండి తల్లిని రక్షించుకోవాల్సిన ఆయన ధర్మాన్ని, తల్లి పట్ల ప్రేమను పట్టించుకోకుండా సైకో మనస్తత్వాన్ని బయటపెట్టుకుంది. బాధలో ఉన్న ఆయన విచారణకు రానని కూడా చెప్పడంలేదు. ఈ నెల 27వ తేదీ వరకు గడువు కోరారు. ఆ తర్వాత విచారణకు హాజరవుతానని సీబీఐ అధికారులకు తెలిపారు. అయినా పచ్చ మీడియా క్రూరత్వాన్ని ప్రదర్శించింది. అవినాశ్‌ను అరెస్టు చేయకపోవడంతో నిరాశ చెందిన ఈ మీడియా.. కొత్త వ్యూహాన్ని రచించింది. సీబీఐ అధికారులు పోలీసు అధికారులను సంప్రదిస్తున్నారని, ఎప్పుడైనా అరెస్టు జరగవచ్చని మరో ప్రచారం మొదలెట్టింది. అదీ కాకపోవడంతో పిచ్చెక్కిపోయింది. పోలీసు అధికారులు సీబీఐకి సహకరించడంలేదని, కేంద్ర బలగాలను రప్పిస్తున్నారంటూ మరోసారి తప్పుడు వార్తలు వ్యాప్తిలోకి తెచ్చింది. మధ్యాహ్నం లోపు హైదరాబాద్ నుంచి కేంద్ర బలగాలు వస్తాయని, ఆ వెంటనే అరెస్టు అంటూ వార్తలు, చర్చలతో పచ్చ పైత్యాన్ని ప్రదర్శించింది. ముఖ్యంగా టీవీ–5, ఏబీఎన్ తప్పుడు కథనాలు, చర్చలతో హోరెత్తించాయి. వాస్తవానికి కేంద్ర బలగాలు కర్నూలుకు రాలేదు. కేవలం కర్నూలులో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించేందుకు ఓ ప్రణాళికతో ఎల్లో మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారం చేశారు.



విశ్వభారతి హాస్పిటల్ వద్ద పోలీసు బందోబస్తు

సీబీఐని కూడా ప్రభావితం చేస్తారా?

సీబీఐ బృందం కర్నూలుకు రాగానే ఎల్లో మీడియా దుష్ప్రచారం మొదలైంది. సీబీఐ అధికారులు ఆస్పత్రికి కూడా వెళ్లలేదు. నేరుగా స్టేట్ గెస్ట్‌హౌస్‌కు వెళ్లి అక్కడే బస చేశారు. అయినా, పచ్చ మీడియా సీబీఐ వెంటనే అవినాశ్‌ను అరెస్టు చేసేస్తోందంటూ ప్రచారం మొదలెట్టింది. టీవీ చర్చల్లో తమకు అనుకూలురను కూర్చోబెట్టి, అధికారులను ప్రభావితం చేసేలా చర్చలు సాగించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఇది కచ్చితంగా పెడ ధోరణేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. చర్చల్లో వక్తలు, యాంకర్లు వ్యక్తం చేసే అభిప్రాయాలు ఇష్టానుసారం అసత్యాలతో సాగుతున్నాయని, మీడియా ట్రయల్ పేరిట వాస్తవాలను వక్రీకరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని చూసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయం నుంచే కర్నూలుకు తరలివచ్చారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, సుధాకర్, శ్రీదేవి, ఆర్థర్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఉదయాన్నే ఆస్పత్రికి చేరుకున్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కడప మేయర్ సురేశ్‌బాబు కూడా ఆస్పత్రికి వచ్చారు. కర్నూలుతోపాటు పులివెందుల, కడప, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నుంచి కూడా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఒక్కసారిగా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తరలిరావడంతో ఆస్పత్రి పరిసరాలు జనంతో కిక్కిరిశాయి. డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రానికి కార్యకర్తల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో ఆదోని, పత్తికొండ సబ్‌డివిజన్ నుంచి మరిన్ని బలగాలు సోమవారం రాత్రికి కర్నూలుకు చేరుకున్నాయి.

శ్రీలక్ష్మిని పరామర్శించిన వైఎస్ విజయమ్మ

వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ సోమవారం సాయంత్రం విశ్వభారతి ఆస్పత్రికి వచ్చి ఐసీయూలో చికిత్స పొందుతున్న శ్రీలక్ష్మిని పరామర్శించారు. శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అవినాశ్‌ను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, అంతా మంచే జరుగుతుందని కాంక్షించారు.

ఆస్పత్రి ముందు కార్యకర్తల నిరసన

ఎల్లో మీడియా అబద్ధపు ప్రచారాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆస్పత్రి ముందు బైఠాయించారు. 'తండ్రిని అకారణంగా జైలుకు పంపారు. తల్లి అనారోగ్యంతో ఉంటే బాగోగులు చూసుకుంటున్న అవినాశ్‌ను వెంటాడి, వేధించడం ఏంటని' నిరసనలో పాల్గొన్న కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆందోళనకరంగానే శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితి

అవినాశ్ తల్లి శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితిపై విశ్వభారతి ఆస్పత్రి హెల్త్ బులెటిన్ రిలీజ్ చేసింది. ఆమెకు నాన్ ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్క్షన్ (గుండెపోటు) ఉందని పేర్కొంది. యాంజియోగ్రామ్ చేశామని, రెండు రక్తనాళాల్లో బ్లాక్‌లు గుర్తించామన్నారు. క్రిటికల్ కేర్ యూనిట్‌లో వైద్యుల బృందం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఆమెకు రక్తపోటు ఇప్పటికీ తక్కువగా ఉండటంతో అయానోట్రోపిక్ సపోర్ట్‌తో ఉన్నారని తెలిపారు. ఆది, సోమవారాల్లో ఆమె వాంతులు చేసుకున్నారని, అల్ట్రాసౌండ్ చేయాల్సి ఉందని తెలిపారు. మరికొద్దిరోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని వెల్లడించారు.

అర్ధరాత్రి వేళ ఆస్పత్రిలోకి చొరబాటు

వందలాది రోగులు, వారి సహాయకులు ఉండే ఆస్పత్రిలోకి మీడియా పదే పదే జొరబడటంపై సీనియర్ విలేకరులే మండిపడుతున్నారు. కేవలం చంద్రబాబుకు ఏదో మేలు చేయాలన్న తపనతోనే ఎల్లో మీడియా పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తోందని విమర్శిస్తున్నారు. ఇదే ఉద్దేశంతో విశ్వభారతి ఆస్పత్రి పరిసరాల్లో ఆదివారం అర్ధరాత్రి, ఎల్లో మీడియా హంగామా చేసింది. రాత్రి 11గంటల తర్వాత ఎల్లో మీడియా ప్రతినిధి ఒకరు తాను పనిచేస్తున్న సంస్థ పేరు కాకుండా మరో పేరు చెప్పి ఆస్పత్రిలోకి వెళ్లారు. శ్రీలక్ష్మి ఉన్న ఐసీయూ సమీపంలో ఓ కానిస్టేబుల్ అతన్ని నిలువరించారు. తప్పుడు పేరు చెప్పి రావాల్సిన అవసరం ఏముందని అక్కడున్న వారు కూడా గట్టిగా నిలదీశారు. దీంతో మీడియా ప్రతినిధి ఆస్పత్రి గేటు వద్దకు వచ్చి అవినాశ్ అనుచరులపై దుందుడుకుగా వ్యవహరించారు. ఇదంతా మిగతా ఎల్లో మీడియా ప్రతినిధులు వీడియో తీయబోయారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఇలా ఎల్లో మీడియా అతిగా ప్రవర్తించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

కాళేశ్వరంతో ఒక నదినే ఎత్తిపోశారు

అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ సమావేశంలో కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఒక నాయకుడి అచంచలమైన నిబద్ధతకు కాళేశ్వరం ప్రాజెక్టు నిదర్శనమని, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ చెప్పారు. ఒక నదిని ఎత్తిపోయడం ద్వారా లక్షలాదిమంది జీవితాల్లో వెలుగును నింపి జీవనోపాధి కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. తెలంగాణ సాగునీటి ప్రగతి ప్రస్థానం, ఇంజనీరింగ్ నైపుణ్యం, దాని ద్వారా కలిగిన మార్పులు ఈరోజు ప్రపంచానికి, సివిల్ ఇంజనీరింగ్ రంగంలో ఆద ర్శంగా నిలుస్తాయని తెలిపారు. అమెరికాలోని నెవడా రాష్ట్రం హెండర్సన్‌లో సోమవారం జరిగిన అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ నిర్వహించిన 'వరల్డ్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ వాటర్ రిసోర్స్ కాంగ్రెస్' సమావేశంలో మంత్రి కేటీఆర్ ప్రారంభోపన్యాసం చేశారు.

618 మీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి...: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడక ముందు కరువుకు నిలయంగా మారడంతోపాటు వ్యవసాయ రంగం సంక్షోభంలో నిలిచిందని కేటీఆర్ చెప్పారు. 55 శాతం జనాభా వ్యవసాయ రంగం మీద ఆధారపడి ఉన్న తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం అత్యవసరం అనే విషయాన్ని గుర్తించి కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు సమయంలో సీఎం కేసీఆర్ పూర్తి చేశారన్నారు. సముద్ర మట్టానికి 90 మీటర్ల ఎత్తున ఉన్న నీటిని 618 మీటర్ల స్థాయికి ఎత్తిపోతల ద్వారా తీసుకుపోయి వివిధ ప్రాజెక్టులు నింపడం ప్రపంచ సాగునీటి చరిత్రలోనే ఒక అద్భు తంగా నిలిచిపోతుందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం తరలించిన మట్టి ద్వారా 101 గిజా పిరమిడ్లను నిర్మించవచ్చని, ఈ ప్రాజెక్టులో ఉపయోగించిన స్టీల్ ద్వారా 66 ఈఫిల్ టవర్ల నిర్మాణం చేయొచ్చన్నారు. ఈ ప్రాజెక్టులో ఉపయోగించిన కాంక్రీట్ ద్వారా 53 బుర్జ్ ఖలీఫాలు కట్టవచ్చన్నారు.

ఇంజనీరింగ్ అద్భుతం: కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని ఒక ఇంజనీరింగ్ అద్భుతం అని కేటీఆర్ పేర్కొన్నారు. 13 జిల్లాల్లో సుమారు 500 కి.మీ మేర ఈ ప్రాజెక్టు విస్తరించిందని, 1,800 కి.మీ కాల్వల నిర్మాణం జరిగిందని, ఏడు మెగా లింకులను 28 ప్యాకేజీలుగా 22 పంపుహౌస్‌ల నిర్మాణం చేశారన్నారు. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ కోసం 20 రిజర్వాయర్లు నిర్మించారని, 50 టీఎంసీలతో మల్లన్న సాగర్ లాంటి అతి పెద్ద రిజర్వాయర్‌ను నిర్మించినట్లు తెలిపారు. 240 టీఎంసీల నీటిని సాగు, తాగు నీటి అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాల కోసం వాడుకునే అవకాశం ఉందన్నారు. కాళేశ్వరంతో 90 లక్షల ఎకరాల్లో రెండు పంటలుగా సాగవుతున్నాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రతిష్టాత్మకమైన 'ఎండ్యూరింగ్ సింబల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రోగ్రెస్'గా గుర్తిస్తూ అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ఇచ్చిన అవార్డును కేటీఆర్ స్వీకరించారు.

జిల్లా వార్తలు

ప్రతీ గిరిజన కుటుంబానికి సంక్షేమ పథకాలు

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పీఓ గౌతమ్

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని ప్రతీ నిరుపేద గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. గిరిజనులు సమర్పించే దరఖాస్తులను యూనిట్ అధికారులు పరిశీలించి అర్హతల మేరకు పరిష్కరించాలని తెలిపారు. కాగా, ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తులను దర్బార్‌లోఇవ్వొద్దని, నోటిఫికేషన్ ఆధారంగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ(జనరల్) డేవిడ్‌రాజ్, డీడీ రమాదేవి, అధికారులు సురేష్‌బాబు, ఆర్.శ్రీనివాస్, భాస్కర్, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో పులిహోర ప్యాకింగ్ యంత్రం



యంత్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్, ఈఓ

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి భక్తులు పులిహోర ప్యాకింగ్ యంత్రాన్ని బహూకరించారు. పాల్వంచ టీచర్స్ కాలనీకి చెందిన నూతక్కి శ్రీనివాసరావు రూ.1.36 లక్షల విలువైన యంత్రాన్ని అందజేసి సోమవారం చైర్మన్ మహిపతి రామలింగం, ఈఓ ఎన్.రజినీకుమారితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, కిలారు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దొరికితేనే దొంగలు..!

- సింగరేణి కాంట్రాక్టర్‌పై చర్యలేవీ?
- సంస్థ అధికారుల్లో కానరాని చలనం
- పోలీస్‌స్టేషన్, సింగరేణి కార్యాలయం చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

సత్తుపల్లి: సింగరేణి సంస్థలో ఉద్యోగాల పేరిట మోసం చేసి డబ్బు దండుకుంటున్న వారిపై ఫిర్యాదులు అందితేనే చర్యలు ఉంటుండడంతో దొరికితేనే దొంగ అన్నట్టుగా వ్యవహారం తయారైంది. దీంతో అక్రమార్కులు సంస్థ పేరు చెప్పుకుని దర్జాగా తిరుగుతూ తమ పని చక్కబెట్టుకుంటున్నారు. సింగరేణి సంస్థలో సబ్ కాంట్రాక్టర్ల వ్యవస్థ లేదని అధికారులు చెబుతున్నా... క్షేత్రస్థాయిలో మాత్రం సబ్ కాంట్రాక్టర్ల చేతుల మీదుగానే అన్ని పనులు జరుగుతున్నాయి. తాజాగా సత్తుపల్లిలోని సీహెచ్‌పీ (కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్) వద్ద పనులు చేపట్టిన సబ్ కాంట్రాక్టర్లు శరత్‌చంద్ర, హరీష్.. పలువురు నిరుద్యోగులను నమ్మబలికి డబ్బులు వసూలు చేసినా అధికారుల కళ్ల పడకపోవడం గమనార్హం. శరత్‌చంద్ర నిరుద్యోగులతో మాట్లాడే సమయాన సింగరేణి అధికారులతో సత్సంబంధాలు ఉన్నట్లు చెప్పుకున్నాడని సమాచారం. అయితే, ఆయనపై ఫిర్యాదు అంది మూడు రోజులు గడుస్తున్నా పరారీలోనే ఉన్నాడని పోలీసులు చెబుతుండగా.. బాధితులు సత్తుపల్లి పోలీస్ స్టేషన్, సింగరేణి కార్యాలయం చుట్టూ మండుటెండల్లో ప్రదక్షిణలు చేస్తున్నారు.

పెరుగుతున్న బాధితుల జాబితా

సబ్ కాంట్రాక్టర్ శరత్‌చంద్ర బాధితుల జాబితా రోజురోజుకు చాంతాడులా పెరిగిపోతోంది. సత్తుపల్లి మండలం గంగారం నుంచి ఒకే కుటుంబం నుంచి ముగ్గురికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఇప్పిస్తానని రూ.8 లక్షలు తీసుకున్నట్టు పోలీసులకు అందిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పత్రికల్లో వస్తున్న సింగరేణి ఉద్యోగాల పేరిట టోకరా వరుస కథనాలతో పలువురు తమకు జరిగిన మోసాలను వెల్లడిస్తున్నారు. సబ్‌కాంట్రాక్టర్ శరత్‌చంద్ర కాకుండా చాలా మంది కాంట్రాక్టర్లు సబ్ కాంట్రాక్ట్‌లకు పనులు అప్పగించి దోపిడీ చేసేందుకు రాచమార్గం చూపుతున్నట్లు చర్చ జరుగుతోంది. స్వీపర్, పంప్ ఆపరేటర్, అటెండర్ పోస్టులకు కూడా వేలాది రూపాయలు సబ్ కాంట్రాక్టర్లు వసూళ్లు చేసి ఉద్యోగాలు ఇవ్వటంపై డిపార్ట్‌మెంట్‌ల వారీగా విచారణ చేయాలంటూ బాధితులు డిమాండ్ చేస్తున్నారు.



సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో పడిగాపులు కాస్తున్న బాధితులు

అసలు కాంట్రాక్టర్‌పై చర్యలేవి?

సత్తుపల్లి సీహెచ్‌పీ పనులకు సంబంధించి శరత్‌చంద్రకు సబ్‌కాంట్రాక్టు ఇచ్చిన కొత్తగూడెం శ్రీసూర్య కన్‌స్ట్రక్షన్స్‌పై చర్యలు తీసుకొని తమకు డబ్బులు ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఆయనకు సబ్ కాంట్రాక్టు ఇచ్చినట్టు ఆథరైజేషన్ లెటర్ ఉందని చెబుతూ సింగరేణి అధికారులు డీఎల్ఆర్ కింద పనులు చేయించుకున్నారని.. ఇందులో పనిచేసిన వారికి డబ్బు కూడా చెల్లించకపోవటం పట్ల బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. అక్రమాలకు తావిచ్చేలా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి బాధితులకు న్యాయం చేయాలని కార్మిక సంఘాల నేతలు కోరుతున్నారు. కాగా, శరత్‌చంద్రపై కేసు నమోదై మూడు రోజులు కావొస్తున్నా సింగరేణి అధికారులు అసలైన కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

సింగరేణి ప్రభావిత ప్రాంతాలకు మొండిచేయి

సింగరేణి ప్రభావిత గ్రామాల స్థానికులకు కాంట్రాక్టు ఉద్యోగాల్లో అవకాశం కల్పించాలని సింగరేణి యాజమాన్యం స్పష్టంగా చెబుతుంది. కానీ ఈ ప్రాంత వాసుల వద్ద డబ్బు తీసుకుంటే బయట పడుతుందనే భావనతో ఇతర ప్రాంతాల వారికే ఉపాధి కల్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికులకు ఉద్యోగాలివ్వాలని ఆందోళనలు చేసినా డైలీ లేబర్ కింద పని కల్పిస్తున్నారే తప్ప ఇతర ఉద్యోగావకాశాలు ఇవ్వటం లేదని చెబుతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

సబ్ కాంట్రాక్టర్ శరత్‌చంద్ర వ్యవహారం మా దృష్టికి వచ్చింది. శ్రీసూర్య కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్‌ను పిలిపించి తదుపరి చర్యలు తీసుకుంటాం. డీఎల్ఆర్ కింద పనిచేసిన వారికి వేతనం అందేలా చూస్తాం. అవసరమైతే కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టేందుకు వెనుకాడేది లేదు. సంస్థలో నియామకాలన్నీ నోటిఫికేషన్ల ద్వారానే జరుగుతాయి. ఎలాంటి పైరవీలతో రావని గుర్తించి దళారులను నమ్మి మోసపోవద్దు.

– జక్కం రమేష్, కొత్తగూడెం ఏరియా జీఎం

పొంగులేటి వెంట పీఆర్ ఈఈ

ఉద్యోగానికి రాజీనామా చేసిన సుధాకర్



కొండూరు సుధాకర్

సత్తుపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్‌గా పనిచేస్తున్న కొండూరు సుధాకర్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. సత్తుపల్లికి చెందిన సుధాకర్ 1988లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నుంచి ఏఈఈగా నియమితులయ్యారు. సత్తుపల్లి, కల్లూరుల్లో డీఈఈగా, కొత్తగూడెం జిల్లా పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్‌గా విధులు నిర్వర్తించారు. సుమారు 36 ఏళ్ల పాటు ఉద్యోగం చేసిన ఆయన ఈ నెల 20వ తేదీన ఉద్యోగానికి రాజీనామా సమర్పించగా ఉన్నతాధికారులు ఆమోదించారు. కాగా, సుధాకర్ ఆరు సార్లు ఉత్తమ పంచాయతీరాజ్ ఇంజనీర్‌గా అవార్డు అందుకున్నారు. ఆయన తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా సత్తుపల్లి, పెనుబల్లి మండలాల్లో విధులు నిర్వర్తించారు.

మాజీ ఎంపీ పొంగులేటితో కలిసి..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రాజకీయంగా పని చేయాలనే సంకల్పంతో ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు సుధాకర్ తెలిపారు. తన రాజకీయ భవిష్యత్‌ను పొంగులేటి నిర్ణయిస్తారని చెప్పారు. కాగా, పొంగులేటి చేరే పార్టీ తరఫున సత్తుపల్లి నియోజకవర్గం నుంచి సుధాకర్ పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

5, 6 తేదీల్లో పీవైఎల్ రాష్ట్ర మహాసభలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో వచ్చే నెల 5, 6 తేదీల్లో పీవైఎల్ రాష్ట్ర రెండో మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం అధ్యక్షుడు సి.బాబూరావు తెలిపారు. ఖమ్మంలో మహాసభల పోస్టర్లను సోమవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సభల్లో భాగంగా తొలిరోజు 5న ఖమ్మంలో ధర్నాచౌక్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు ప్రదర్శన, భక్తరామదాసు కళాక్షేత్రంలో బహిరంగ సభ ఉంటాయని తెలిపారు. ఈ సభలో సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు, కె.గోవర్దన్, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐలయ్య పాల్గొంటారని చెప్పారు. ఇక 6వ తేదీన ప్రతినిధుల సభలో ప్రొఫెసర్ జి.హరగోపాల్ ప్రధాన వక్తగా పాల్గొంటారని తెలిపారు. యువతీ యువకులు భారీగా హాజరై మహాసభలను జయప్రదం చేయాలని బాబూరావు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల బాధ్యులు కాకి భాస్కర్, టి.వేణు, ఎస్.పూర్ణచందర్‌రావు, ఎం.శ్రీనివాస్, శోభారాణి, కల్పన, ఎం.గిరి పాల్గొన్నారు.



పీవైఎల్ మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

శరత్‌బాబుకు భద్రాచలంతో అనుబంధం

భద్రాచలం: ప్రముఖ సినీ నటుడు శరత్‌బాబుకు భద్రాచలంతో అనుబంధం ఉంది. కోవిడ్ రెండో లాక్‌డౌన్ అనంతరం ఆయన ఇక్కడ శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి జరిగిన దర్బార్ సేవలోనూ పాల్గొన్నారు. సోమవారం అనారోగ్యంతో శరత్‌బాబు మృతి చెందడంతో స్థానికులు, ఆలయ సిబ్బంది ఆయనను స్మరించుకున్నారు. అలాగే, శరత్‌బాబు మృతి పట్ల స్థానిక కళాకారులు సంతాపం తెలిపారు.

మంత్రి పువ్వాడ సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంగాంధీచౌక్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సినీనటుడు శరత్‌బాబు మృతిపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం ప్రకటించారు. ఈమేరకు ఓ ప్రకటనలో ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే, శరత్ బాబు మృతిపై ఖమ్మం కళా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేత తదితరులు నివాళులర్పించారు. కాగా, చిల్లర దేవుళ్లు సినిమాలో తాను శరత్‌బాబుతో కలిసి నటించామని కళాకారుడు నాగబత్తిని రవి గుర్తు చేసుకున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో ఆర్థికాభివృద్ధి

టేకులపల్లి: రైతులు పంట మార్పిడి అవలంబిస్తూ ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారిస్తే లాభాలు వస్తాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మరియన్న పేర్కొన్నారు. ఉద్యాన శాఖ అధికారులు సోమవారం టేకులపల్లి మండలంలో పర్యటించి ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే, కోయగూడెంలో జెడ్పీ చైర్మన్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం కనకయ్య, మరియన్న మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో పంట మార్పిడి చాలా అవసరమన్నారు. మిగిలిన పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి ఉన్నందున రైతులు సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుంచి రాయితీలు కూడా ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యాన శాఖ అధికారి సముద్రాల విజయ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సాయికిరణ్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్మన్, అధికారులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలంలోని జోగులపాడు వద్ద మోటార్ సైకిల్‌ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లి పరిధిలోని భూక్యాతండాకు చెందిన భూక్యా ప్రవీణ్, మీనాక్షి, హర్షిణి మోటార్‌సైకిల్‌పై చంద్రుతండా పరిధిలోని చింతలతండా బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వెళ్లే క్రమాన జోగులపాడు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిని ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.